# తాతా! కారు కావాలి

'తాతా! కారు కావాలి' అంది మనుమరాలు. ముద్దుల మూట. కబుర్ల పుట్ట. అందాల బరిణె. ఏడేళ్ళు. రెండో తరగతి పాసయింది. వేసవి సెలవులు గడిస్తే మూడులో చేరుతుంది.

'ఓ యస్ అదెంతపని. రండి పోదాం!' అన్నాడు తాత.

'నేనూ వస్తా!' అన్నాడు మనుమడు. ఆగడు. ఒకటే దూకుడు. ఒకటి పాస్. రెండులో చేరాలి. కదలడు వదలడు వ్యవహారం. ఆటలు, పాటలు, నిలబడితే ఒట్టు.

'మనమే! మన ముగ్గురం! రడీ?' అన్నాడు తాత.

'రడీ!' అన్నారిద్దరూ ఒకేసారి.

తాత కారు తీశాడు. తన కూతురు పిల్లల్ని రడీ చేసింది.

'సతాయిస్తారు' అంది. 'జాగ్రత్త' అంది. 'తొందరగా వచ్చేయండి' అంది. ఇంకా ఏదో అంటూనే అంది. అప్పటికే వీళ్ళు కారు ఎక్కారు. దానికి ప్రాణం వచ్చింది. బయలుదేరింది. వాళ్ళమ్మ చేయి ఊపుతూనే ఉంది.

వేసవి సెలవులు. కూతురు అల్లుడు పిల్లలు వచ్చారు. తల్లిదండ్రులిద్దరూ లెక్చరర్లు కావటంవల్ల, నలుగురికీ ఎండాకాలం రెణ్ణెల్లు సెలవులు.

తాతకు వాళ్ళంటే చాలా ఇష్టం. వాళ్ళకు తాత దగ్గర అన్ని లైసెన్సులున్నాయి. ఆడతారు. పాడతారు. పడతారు. లేస్తారు. తాతను పాడమంటారు. ఆడమంటారు. నిలవనీరు, కూర్చోనీరు. టి.వి. పెడతారు. చూడరు. ఒక్కచోట ఉండరు. ఏ వస్తువు కనబడకపోయినా వాళ్ళను అడగాలి. దర్జాగా తెచ్చి ఇస్తారు. ముఖ్యంగా కళ్లజోడు. తాత జోడు పెట్టుకొని పోజులు కొడుతుంటారు.

వాళ్ళు నిద్రపోతున్నప్పుడు ఇల్లు బోసిపోయినట్లుంటుంది. వాళ్ళు లేస్తే సంగీత కచేరి, డాన్స్ ప్రోగ్రాం, ఆటల పోటీలు, నడవరు, ఆగరు. దూకుడు. నిలవరు. ఇంటికి ప్రాణం వచ్చినట్లుంటుంది. తాతకు ఆనందం. 'గోల చేయొద్దు' అంటుంది వాళ్ళమ్మ. 'చేయనీయమ్మ' అంటాడు తాత. అందుకే తాత బెస్ట్. వాళ్లమ్మ కటీఫ్!

'కారు స్పీడ్‌గా పోదా?'

'పోతుంది'

'పోనీ మరి' మనుమరాలు ఆర్డరు జారీ చేసింది.

స్పీడ్ మంచిది కాదని చెప్పటానికి తాత అమ్మాయిని ప్రశ్నించాడు.

'స్పీడ్‌గా పరుగెత్తితే ఏమవుతుంది?'

'ప్రయిజు వస్తుంది'

'ఎవరైనా అడ్డం వస్తే?'

'పడతాం!'

'పడితే?'

'లేచి పరుగెత్తుతాం!'

'దెబ్బతగలదా?'

'ఎప్పుడయినా తగులుతుంది!'

'స్పీడ్‌గా పోతే, ఎవరైనా అడ్డం పడితే, కారుకు దెబ్బతగలదా?'

'తగులుతుంది!'

'అడ్డం పడిన వాళ్ళకు?'

'దెబ్బతగులుతుంది'

'కార్లో ఉన్నవాళ్ళకు?'

'దెబ్బతగులుతుందా?'

'తగలదామరి?'

కారును స్పీడ్‌గా పోనివ్వమని అమ్మాయి మళ్ళీ అడగలేదు.

ఇద్దరూ బుద్ధిమంతుల్లా కూర్చుని చుట్టూ చూస్తూ వాళ్ళిద్దరే మాట్లాడుకొంటున్నారు.

వాళ్ళ అమ్మ బాగా చదువుకొంది. అన్ని పరీక్షలు బాగా పాసయింది. ఎంఏ అయింది. నెట్ పాసయింది. డాక్టరేటు చేసింది. అంతా చిన్నవయస్సులోనే లెక్చరరు అయింది. బాగా పాఠాలు చెబుతుంది.

చిన్నప్పటి నుంచి తనపని తాను సక్రమంగా చేసుకొనేది. ఆడినా, పాడినా, చదివినా అల్లరిగా ఉండేది కాదు. బుద్ధిగా ఒద్దికగా ముద్దుగా బొద్దుగా ముచ్చటగా ఉండేది.'

బట్టలు శుభ్రంగా ఉంచుకొనేది. చించుకోదు. మురికి చేసుకోదు. తన పుస్తకాలు ఎప్పుడు కొత్తగా ఉండేవి.

అక్కా, అన్నా, తమ్ముడూ ఆడుకొంటుంటే, ఈ కూతురు గడ్డం కింద చేతులు పెట్టుకొని, వీధి గుమ్మంలో గుమ్మటంలా, బొమ్మలా, ఫోటోలోలా కదలక మెదలక కూర్చుని వాళ్ళ ఆటలు చూస్తుండేది.

అట్లాంటి తల్లికి కాలు నిలవని వీళ్ళు, నిమిషం తీరుబడిగా ఉండని వీళ్ళు సంతానం. వీళ్ళ అల్లరి తల్లికిష్టం.

ఈ అల్లరితో పాటు, ఆమె చిన్ననాటి మౌనం కూడా తాతకిష్టం.

'తాతా!' మనుమరాలు కేక పెట్టింది.

'ఏమ్మా?'

'ఐస్‌క్రీం!' అంది.

'ఐస్‌క్రీం కావాలీ' అన్నాడు మనుమడు.

'ఐస్‌క్రీం అంటే మాటలా?' వాళ్ళమ్మ పెట్టదు. ఎవరినీ పెట్టనివ్వదు. పెడితే కోప్పడుతుంది. పెట్టినా చెప్పకూడదు. పిల్లలతో ఒక ఒప్పందానికి వచ్చాడు. 'అమ్మతో చెప్పకూడదు!' 'చెబితే?' 'కొడుతుంది. తిడుతుంది' 'చెప్పం!'

ఐస్ క్రీం పార్లర్ ముందు కారాపాడు తాత. ముగ్గురూ దిగారు. లోపలికి పోయారు.

వాళ్ళు ఐస్‌క్రీం తింటుంటే, ముక్కుతుడుస్తూ మూతి సవరిస్తూ కూర్చున్నాడు తాత.

'నువ్వూ తిను తాతా!' అంది మనుమరాలు

'వద్దమ్మా. అమ్మమ్మ తిడుతుంది'

వాళ్ళకు ఆశ్చర్యంగా ఉంది.

'అమ్మమ్మ అంటే భయమా?' మనుమడు అడిగాడు.

'భయమే' అన్నాడు తాత.

'అమ్మమ్మ అంటే తాతకు భయం. అమ్మమ్మ అంటే తాతకు భయం' అని వాళ్ళిద్దరూ నవ్వుకోసాగారు.

నవ్వాపి 'అమ్మమ్మకు చెప్పంలే. ఐస్ క్రీం తిను' అని ఇద్దరూ భరోసా ఇచ్చారు.

'తింటే నాకు జలుబు చేస్తుంది. నేను తినను. ఇష్టమే కానీ తినను'

వాళ్ళకు అర్థం కాలేదు. ఒకరి ముఖం ఒకరు చూచుకొన్నారు.

తన పిల్లలు ఏం కావాలన్నా అడిగేవాళ్ళు. తాను తెచ్చి ఇచ్చేవాడు. వీళ్ళ అమ్మ ఏమీ అడిగేది కాదు, వాళ్ళకు తెచ్చినవే ఆమెకు ఇస్తే ఆనందంగా తీసుకొనేది. తృప్తిగా ఉండేది.

తానేమీ అడగదు. ఆమెకేమి కావాలో తల్లిదండ్రులే గుర్తించి తెస్తారని పూర్తి విశ్వాసంతో ఉండేది.

ఆమె ఏదీ కోరుకోకుండానే అన్నీ సమకూరాయి. ఆమె బాల్యమంతా చదువంతా, ఉద్యోగం దాకా అన్నీ ఆమె చెప్పక పోయినా, కావలసినట్లే జరిగాయి.

తాను కాబోయే అల్లుణ్ణి చూచి, ఇష్టపడి, నా కూతురిని చూడమంటే చూశాడు. పెళ్ళి చేసుకోమంటే సరే నన్నాడు. పెళ్ళికి మౌనంగా అంగీకరించింది. ఆనందంగా పెళ్ళి చేసుకొంది. సంతోషంగా జీవిస్తూ ఉంది. ఇద్దరికీ ఉద్యోగాలు. పిల్లలు రత్నమాణిక్యాలు. తల్లిదండ్రుల పట్ల తీరని మమత. ఇప్పటికీ పసిబిడ్డలాగే తల్లిదండ్రుల సందిట ఆమె ఒదిగిపోతుంది.

తన కూతురు ఏమయినా అడిగితే కొనిద్దామని ఉంటుంది. ఏమీ అడగదు. 'ఎందుకు ఏమీ అడగవు' అని ప్రశ్నిస్తే 'అడిగేపని లేకుండా అన్నీ సమకూరుస్తున్న మిమ్మల్ని ఏమడగాలి?' అనేది.

మనుమడికీ మనుమరాలికి తల్లంటే హడలు. కొట్టదు. తిట్టదు. ఉరిమి చూడదు. ఊరికే ఉంటుంది. అది వాళ్ళు భరించలేరు. అమ్మ మాట్లాడాలంటే తాము ఏమి చేయరాదో, ఏమి చేయాలో వాళ్ళకు బాగా తెలుసు. కూతురి మౌనానికి ఇంతశక్తి ఉందని తనకు ఇప్పుడిప్పుడే బాగా తెలిసి వస్తూ ఉంది.

పిల్లలకు తండ్రి దగ్గర పూర్తి ఫ్రీడం. సంపూర్ణ స్వేచ్ఛ. ఏమయినా చేయవచ్చు. తినవచ్చు తిరగవచ్చు., పడవచ్చు లేవచ్చు దూకవచ్చు ఏడవ్వచ్చు. చాలా స్వాతంత్ర్యం.

నలుగురు పిల్లలు, పెళ్ళిళ్లయి, ఉద్యోగాలు చేసుకొంటూ పిల్లలు కలిగి, ఎవరిజీవితం వాళ్ళు సుఖంగా గడుపుతున్నారు. ఇప్పుడు ఎవరూ ఏమీ కావాలని అడగరు.

చిన్నప్పుడు ఈ పిల్లలు కాళ్ళకూ చేతులకూ అడ్డం పడుతూ, ఏమేమో చెప్పేవాళ్ళు, ఏమేమో అడిగేవాళ్ళు. తిడుతూ దీవిస్తూ, బతిమాలుతూ భంగపడుతూ వాళ్ళ కోర్కెలు ఎలాగైనా సరే తాను తీర్చేవాడు.

తానూ తనభార్యా ఉద్యోగాలు చేసి సుఖసంతోషాలతో ఉన్నట్లే, పిల్లలు, దంపతులై, కుటుంబంలో ఇద్దరూ ఉద్యోగాలు చేసుకొంటూ, ఇద్దరి పిల్లల్ని కనిపెంచుకొంటూ ఇల్లో ఏపార్టుమెంటో సంపాదించుకొని సుఖంగా ఉన్నారు.

వాళ్ళేమీ అడగరు.

ఏమయినా కొని ఇస్తే 'మేమింకా పిల్లలమా?' అంటారు.

'పిల్లలున్నారుకదా!' అంటే 'ఇన్నా?' అంటారు.

పెద్ద కూతురి పిల్లలు పదీ, తొమ్మిదీ చదువుతున్నారు. ఈ మగరాయుళ్ళు గడుగ్గాయిలు, వాళ్ళకేమీ అవసరం లేదు. ఏమీ అడగరు.

చిన్నకూతురి పిల్లలు ఏమయినా అడగ్గలిగితే నోరున్నవాళ్ళు అయ్యారు.

ఇద్దరి కొడుకుల పిల్లలు ఇంకా చిన్నవాళ్ళు. ఏమీ అవసరం లేదు. అడగలేరు. తీసుకోలేరు. చాక్‌లెట్లు ఇస్తే నమిలి పారేస్తారు, వాళ్ళకు ఏంకావాలో వాళ్ళకే తెలియదు.

చిన్నకూతురు పిల్లలు మనుమడు మనుమరాలు-వీళ్ళే సిసింద్రీలు. వీళ్ళకే తాతదగ్గర చనువు.

పదిహేడేళ్ళ నుంచి, తన సంతానం భవిష్యత్తును వెతుక్కొంటూ వెళిపోవటం ప్రారంభమయింది. పదేళ్ళకు పూర్వం అందరూ ఉద్యోగాలకోసం వెళిపోయారు. ఎనిమిదేళ్ళ క్రితం చివరివాడికి కూడా పెళ్ళయిపోయింది. వాళ్ళ జీవితాలు వాళ్లవి అయ్యాయి. కష్ట సుఖాలు వాళ్ళే పంచుకొంటున్నారు. వాళ్ల జాగ్రత్తల్లో వాళ్ళున్నారు. వాళ్ళ పిల్లల్ని వాళ్ళు బాగా పెంచుకొంటున్నారు. పిల్లలకు, తమకు సెలవులు ఉన్నప్పుడు వస్తారు. తల్లినీ తండ్రినీ ప్రేమగా చూస్తారు. వారమో పదిరోజులో నెలో రెణ్ణెల్లో ఉంటారు. వెళతారు. వస్తూ ఏమయినా తెస్తారు. వద్దన్నా ఇస్తారు. వెళ్ళేటప్పుడు ఏమీ తీసుకోరు. 'మీరు సుఖంగా ఉంటే అంతేచాలు' అని వెళిపోతారు. తల్లిదండ్రులకు సంతోషం మాత్రమే కలిగించటం వాళ్లకిష్టం, నలుగురూ తమ కుటుంబాలతో కూడబలుక్కొన్నట్లు ప్రేమగా, ఆదరంగా, ఆత్మీయంగా ఉంటారు.

మనుమడి, మనుమరాలి మూతులు, చేతులు కడిగి కార్లో కూర్చోబెడుతుంటే తనకు ఎంతో ఆనందంగా ఉంది.

ఇంత ఆనందం ఈ మధ్య కలగలేదు. తన పిల్లలు, తమను ఏమీ అడగక పోవటం వాళ్ళ మంచితనం, వాళ్ళ ప్రేమ.

ఎవరైనా ఏమయినా అడిగితే, పిల్లలుగానీ, పిల్లల పిల్లలుగానీ, వాళ్ళకోర్కె తీర్చటం తనకు ఆనందం.

ఎవరూ ఏమీ అడగరు!

ఎవరి కోర్కె అయినా తీరిస్తే, కలిగే ఆనందం తనకీ మధ్య కలగలేదు.

కొనివ్వటం కంటే, ఇవ్వగలగటం కంటే, అడిగితే, తనవాళ్ళకు, ఇచ్చే అవకాశం అదృష్టంగా తాను భావిస్తాడు.

ఇచ్చే అదృష్టం లేకపోవటం వేరు. ఇవ్వలేకపోయినా సాధించి ఇవ్వటం వేరు. ఇవ్వలేని బాధకంటే ఎవరూ ఏమీ అడగటం లేదనే బాధ పెద్దది.

తనను అశక్తుడుగా, అనర్హుడుగా, అయోగ్యుడుగా పిల్లలు భావిస్తున్నారేమో ననే బాధ మరీ పెద్దది.

ప్రేమించిన వాళ్ళు జీవితాంతం ఎవరేం అడిగినా ఇచ్చే పరిస్థితి ఉంటే ఎంతబాగుంటుంది!

నాకిది కావాలని అడిగే సొంతం వాళ్ళు లేకపోవటం ఎంత దౌర్భాగ్యం!

ఆ దౌర్భాగ్యం నుంచి, దురదృష్టం నుంచి తనను కాపాడి అదృష్టవంతుణ్ణి చేశారు వీళ్ళు.

మనమరాలు కారు కావాలన్నందుకు ఎంతో ఆనందం. ఐస్‌క్రీం కావాలన్నందుకు ఎంతో పరవశం. ఎంతో సంతోషం. తాను ఆనందం అంచులు తాకుతున్నాడు.

బొమ్మల షాపుకు వెళ్ళారు. కార్లు చూపమన్నారు.

నెడితే పోయేవి, కీ ఇస్తే కదిలేవి, నెడితే కీ ఇచ్చుకొనేవి చాలాకార్లు చూశారు.

పెద్దకార్లున్నాయి. బేటరీతో నడుస్తాయి. వెళుతుంటే ఫైరింజను శబ్దం వస్తుంది. రంగు రంగుల దీపాలు వెలుగుతాయి. ఉన్నట్టుండి తుపాకులు పేలుస్తుంది ఢాం అంటుంది. డుర్రు అంటుంది. రిమోటు ఉంది. ఆపితే ఆగుతుంది. వదిలితే వెళుతుంది. ఎటుకావాలంటే అటు తిప్పవచ్చు. బేటరీ అయిపోతే కొత్త బేటరీ వేసుకోవాలి. తాతకు అవి ఇష్టమయ్యాయి. పిల్లలూ ముచ్చట పడ్డారు. ఇద్దరికీ చెరొకటి కొన్నాడు.

తాను చిన్నతనంలో ఇటువంటి వాటితో ఆడుకోలేదు. ఇసుక, మట్టి గొప్ప ఆటవస్తువులు. తిర్నాలలో కొన్న డమడమాల బండి లాగుతుంటే దరువేసేది. చిన్నప్పటి నుంచి చెక్క అరిటి పళ్ళ గుత్తి ఉండేది. పాలుతాగుతున్నప్పుడు తనకు కొనిచ్చిన గిలక్కాయతో తన పిల్లలు కూడా ఆడుకొన్నారు. ఆడపిల్లలు ఆడుకొనే లక్కపిడతల్లోంచి ఎప్పుడో ఒకటి కొట్టేసి దాచి పెట్టుకొన్నాడు. కొంచెం పెద్దయ్యాక చెక్కతో కీలుగుర్రం చేయించి ఇచ్చారు. దానిమీద స్వారీ చేసేవాడు. అది ముందుకీ వెనక్కీ కదిలేది. కదిలేదేకాని ఎక్కడికీ పోయేదికాదు. నడక నేర్చుకొంటున్నప్పుడు మూడు చక్రాల తోపుడు బండి చేయించి ఇచ్చారు. కాళ్ళొచ్చాయి. నడక వచ్చింది. ఊరంతా స్వాధీనమయింది. బండి తోసుకొంటూ ఊరంతా తిరిగేవాడు తాను.

తనకోసం తన తల్లిదండ్రులు ఊరంతా తిరిగి వెతికి, ఆడి ఆడి అలిసి ఏ వేపచెట్టుకిందో నిద్రపోతున్నవాడినో, చెరువులో కప్పల్ని కొడుతున్నవాడినో, పిచికల గుంపును పట్టుకోబోతున్నవాడినో, లేగదూడ తోక పట్టుకొని పడుతూ లేస్తూ పరుగులు తీస్తున్న వాడినో చూచి, జబ్బపట్టుకొని ఇంటికి గుంజుకుపోయేవాళ్ళు.

ఆ రోజుల్లో తనకు బొమ్మల పుస్తకాలు లేవు. తన పిల్లలకున్నాయి. కీ ఇస్తే తిరిగేకార్లు లేవు. తన పిల్లలకున్నాయి. బేటరీలతో నడిచే రైళ్ళు కార్లు, విమానాలు లేవు. పాటలు పాడే, ఆటలు ఆడే, దరువులు వేసే బొమ్మలు లేవు.

ఇద్దరి ఉద్యోగాలవల్ల ఆర్థిక సమస్యలు లేవు. ఉన్నంతలో తృప్తి మెండుగా ఉండేది. పిల్లల సుఖ సంతోషాల కోసం ఏమైనా చేసేవాడు తాను.

అదృష్టవశాత్తు చాలా పెద్ద ఉద్యోగిగా తాను రిటైరు అయ్యాడు. ప్రభుత్వ బంగళా ఇక ఉండదు. ఏసిలు ఉండవు. మూడుకార్లు అయిదుగురు డ్రైవర్లు ఉండరు. వ్యక్తిగత ఉద్యోగులు ముప్పయి తొమ్మిది మందీ ఉండరు.

రిటైరు అయినపుడు సొంత ఇల్లు అయితే ఉంది కానీ సొంతకారు లేదు.

కారులో తిరిగిన మనిషి కాలినడకన పోతుంటే అందరూ పరామర్శించి, సానుభూతి చూపించి చంపుతారు.

ఈ అవస్థ తప్పించుకోవటానికి కారు కొనుక్కోవలసి వచ్చింది. తన కారు తాను నడుపుకోగలడు కాబట్టి డ్రైవరు అక్కరలేకపోయాడు.

పిల్లలమీద ఏమీ ఖర్చుచేసే పరిస్థితి లేకపోవటంవల్ల కొత్తకారును పసిబిడ్డలాగా చూచుకోసాగాడు తాను.

జనం కోసమేకానీ, తనకోసం నిజానికి కారు అవసరం కాదు.

కానీ ముందు ముందు అవసరం ఎక్కువవుతుంది. డాక్టరు, హాస్పటలు, మార్కెట్టు, బజారు ఏమి అవసరమయినా కారు తప్పనిసరి కావచ్చు.

తన భార్య త్వరగా పెద్దదైపోయింది. ఆమెను ఎక్కడికి తీసుకుపోవాలన్నా కారు కావాలి.

వృద్ధాప్యంలో కారు తప్పదు.

డ్రైవరు ఉంటే మంచిదే. తాను నడపలేనప్పుడు డ్రైవరును పెట్టుకోవచ్చు.

తనకున్న పరిమితమైన వనరులతో భద్రంగా ఉంటే సుఖంగా బ్రతకవచ్చు.

పిల్లల్ని తానేమీ అడగలేదు. ఇచ్చినా తీసుకోలేదు.

తన తల్లిదండ్రులు తనకు చదువు చెప్పించి పెద్దవాణ్ణి చేశారు.

తానూ తన పిల్లల్ని చదివించి జీవితంలో సుఖపడేట్టు చూశాడు.

కొందరు ఇవ్వగలరేకానీ ఏమీ పుచ్చుకోలేరు. అంతే కొందరు. తానూ ఆ కొందరిలో ఒకడే!

కారులో తిరిగి వస్తున్నప్పుడు అమ్మాయి అడిగింది. 'తాతా పూలు' తాను కారు ఆపాడు. దిగాడు.

'నాకూ, అమ్మకూ, అమ్మమ్మకూ' అంది మనుమరాలు. ఎంతో ముచ్చటేసింది.

చిన్నతనం నుంచి పూలంటే తనకూ ఇష్టమే. ప్రతి సాయంత్రం భార్యకు పూలు తీసుకుపోయేవాడు. ఆడపిల్లలు పెరిగి పెద్దవుతున్న కొద్దీ తీసుకుపోయే పూల పొట్ల పెద్దదయ్యేది. ముగ్గురూ ముచ్చటగా తలలు దువ్వుకొని, పూలు పెట్టుకొని బొమ్మల్లాగా ఉండే వాళ్ళు. ఈ మనుమరాలు వాళ్ళ వారసురాలు. తన కూతురు పూలు చూస్తే ఎంతమురిసి పోతుందో!

పూలు తీసుకొని కారెక్కి స్టార్టు చేయగానే పిడుగు అరిచాడు. 'తాతా బేకరీ!'

తాను దిగితే, తనతో పాటు మనుమడూ దిగాడు. బిస్కట్లు, చాక్‌లెట్లు, కేకులు, బ్రెడ్డు తీసుకొని ఇస్తే అలివికాని కేరీబాగ్ గుండెలకదుంకొని కారెక్కాడు. తానుఎంత ముచ్చటగా చూశాడో వాణ్ణి.

బుక్‌షాపు దగ్గర ముగ్గురూ దిగారు. బొమ్మల పుస్తకాలు, కార్టూను బుక్కులు, బాలల

కథా చిత్రాల పుస్తకాలు వాళ్ళకిష్టమైనవీ, వాళ్ళకోసం తన కిష్టమైనవీ కొని ఇచ్చాడు. ఇద్దరూ ఇన్నిన్ని పుస్తకాలు చేతులకు అమరకుండా పట్టుకొని కారెక్కారు.

తన పిల్లలు చిన్న వాళ్ళుగా ఉన్నప్పుడు ఎన్నో పుస్తకాలు కొని ఇచ్చేవాడు తాను. నలుగురికీ నాలుగు వేరు వేరు పుస్తకాలు తెచ్చినా, నలుగురూ కలిసి ఒక్కొక్క పుస్తకం పడిపడీ చూచేవాళ్ళు. తీరికగా చదివేవాళ్ళు. అరుపులు నవ్వులు కేరింతలు, ఎంత ముద్దుగా పెరిగారు తన బిడ్డలు .

తోవ పొడుగునా వాళ్ల మాటలే మాటలు. కబుర్లే కబుర్లు! గుండెకు వెన్న రాసినట్లుంది. ఎంత తృప్తి! ఎంత సంతోషం! ఎంత పరవశం!

వాకిట్లో వాళ్ళ అమ్మ పక్కనే నిలబడ్డ కూతురు తండ్రిని చూడగానే, పిల్లల్ని చూస్తూ ముందుకు వచ్చింది.

రెండుకార్లూ మనుమడు తీసుకువచ్చాడు.

బేకరీ కేరీబేగ్, పుస్తకాల పొత్తులు కూతురు తీసుకొంది.

పూల పొట్లం మనుమరాలు తీసుకొని వస్తూ తాతకోసం ఆగింది. తాత రాగానే 'మనం మరింక ఇప్పుడు ఎక్కడికీ పోమా?' అంది.

'చీకటి పడింది కదా, కావాలంటే రేపు పోదాం సరేనా?'

పాప సరే అనలేదు.

'మా నాన్నను బాగా ఆటలు పట్టించారా?' అని వాళ్ళమ్మ అడిగితే, మనుమడు నవ్వాడు. మనుమరాలు మౌనంగా ఉంది.

'ఎందుకు నాన్నా ఇవన్నీ?' అంది కూతురు. అచ్చంగా చిన్నప్పుడు అన్నట్లే.

తాను ఎంతో తృప్తిగా ఉన్నాడు.

తన కూతుర్ని వాళ్ళ తల్లి అడిగింది' ఎందుకే అలా ఉన్నావు?' అని.

మనుమరాలు బదులు చెప్పలేదు.

తమ్ముడు కారుతో ఆడుకొంటున్నాడు. ఆ కారు పరుగులు తీస్తూ ఉంది. దానివెనక పిల్లవాడు పరుగులు తీస్తున్నాడు.

అక్క ఊరికే కూర్చుంది. అక్క కారు కదలకుండా ఉంది.

'కారు కావాలంటివి ఆడుకోవేం?' తాత మనుమరాలిని అడిగాడు.

'నాక్కారు ఇవ్వలేదుగా!'

'అదిగో-అది నీదే- బేటరీ కారు. బొమ్మల కారు, రంగుల కారు. తుపాకులకారు, దుర్రుబుర్రుకారు'

'నేనడిగింది బొమ్మకాదు!'

'మరి?' తాత అమోమయంగా చూశాడు.

తాత ముఖంలోకి మనుమరాలు చూస్తూ ఉంది.

తన కూతురు అల్లుడు బొమ్మల్లాగా అయిపోయారు.

తన భార్య విచిత్రంగా చూస్తూ ఉంది.

మనుమడు పరుగెత్తే కారు వెనుక పరుగులు తీస్తున్నాడు.

మనుమరాలు తాత వళ్ళో కూర్చుని గడ్డం పుడుకుతూ ఉంది.

'నాకు నిజంకారు, నువ్వునడిపే కారు, నీకారు, నీకారు నాక్కావాలి. తాతా! కారు కావాలి!'